

అడిషనల్ ఎస్‌పి భాస్కరరావుకు ఉత్తమ సేవా పతకం

ప్రజాశక్తి- కాకినాడ



కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్‌పి(అడ్మిన్) ఎంజెవి. భాస్కరరావుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ సేవా పతకాన్ని ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఈ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా ఎస్‌పి సతీష్‌కుమార్ ఉత్తమ సేవా పతాకాన్ని అందుకోనున్న ఆయన్ని అభినందించారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయం పరిపాలన అధికారి ఎం.శివరామరాజు, మినిస్ట్రీయల్ సిబ్బంది, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న డిఎస్‌పిలు, సిఐలు, అభినందనలు తెలిపారు.


నిర్మాణాలు నాసిరకం

- కాంట్రాక్టర్ల ద్వారా జగనన్న కాలనీ నిర్మాణాలు
- నాణ్యతా ప్రమాణాలకు పాతర
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైసిపి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఈ పథకంతో పేదల కలలు నిజమవుతున్నాయని పాలకులు గొప్పలు చెబుతున్నారు. నిర్మాణాలు నిర్ణీత గడువులోగా చేపట్టాలని కొన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టర్లకు ఆ బాధ్యతలు అప్పగించారు. దీంతో కొన్ని జగనన్న కాలనీల్లో కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న గృహాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. కాకినాడ అర్బన్ లబ్ధిదారులకు యు.కొత్తపల్లి మండలం కొమరగిరి లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలిస్తే నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నట్లు ఇట్టే అర్థమైపోతోంది.

కాకినాడ జిల్లాలో పిఎం ఆవాస్ యోజన- వైఎస్ఆర్ (అర్బన్) బిఎల్‌సి పథకం, పిఎం ఆవాస్ యోజన వైఎస్ఆర్ (గ్రామీణ) పథకాల్లో రూ.1361.67 కోట్ల నిధులతో 75,648 ఇళ్ళు మంజూరయ్యాయి. కాకినాడ నగరంలో పేదలకు స్థలాలు అందుబాటులో లేకపోవడంతో కొమరగిరి లే అవుట్‌లో కేటాయించారు. 2020 డిసెంబర్ 25న సిఎం వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకానికి ఇక్కడ నుంచే శ్రీకారం చుట్టారు. ఇక్కడ నగర వాసులకు 16,138 మందికి పట్టాలు ఇచ్చారు. అప్పటినుంచి నిర్మాణాలు నత్తనడకనే సాగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. నాలుగేళ్ల కాలంలో 13 శాతం ఇళ్ళు కూడా పూర్తి కాకపోవడం విశేషం.



కొమరగిరి లే అవుట్ లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి నిర్మించిన పునాది

11 కాంట్రాక్టు సంస్థల ద్వారా పనులు

కొమరగిరి లేఅవుట్‌లో జెఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఐషన్ ఇన్‌ఫ్రా ప్రయివేట్ కన్‌స్ట్రక్షన్స్ తదితర 11 కాంట్రాక్ట్ లేబర్ ఏజెన్సీలు గత ఏడాదిన్నర కాలంగా నిర్మాణాలు జరుపుతున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలతో సహా డ్వాక్రా సంఘం నుంచి రూ.35 వేలతోపాటు లబ్ధిదారుల వాటా రూ.85 వేలు మొత్తం రూ.3 లక్షలతో సంబంధిత సంస్థలే నిర్మాణాలు పూర్తి చేసి ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. అయినా ఇళ్ల నిర్మాణాలు నత్తనడకనే సాగుతున్నాయి. ముఖ్యంగా జరుగుతున్న పనుల్లో పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలకు పాతరేసి నిర్మిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటి నిర్మాణం మొత్తం పునాదిపైనే ఆధారపడి ఉంటుంది. కింద స్థాయి నుంచి నాణ్యతగా వేస్తేనే కొన్నేళ్లపాటు నిలకడగా ఉంటుంది. అయితే కాంట్రాక్ట్ సంస్థలు నాలుగు అడుగులు ఎత్తున నిర్మిస్తున్న పునాది పనుల్లో నాణ్యతను పక్కన పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. భూమిలోకి కనీసం నాలుగు అడుగుల లోతులో పిల్లర్లు వేయాల్సి ఉంటుంది. కానీ పైపైనే భీము వేసి నిర్మించడం వల్ల భవనం త్వరగా కూలిపోయే ప్రమాదం ఉందని లబ్ధిదారులు చెబుతున్నారు. సముద్రానికి సమీపంలో ఉండడం వల్ల ఉప్పునీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ నిర్మాణాలు నాణ్యతతో జరిగితేనే నివాస యోగ్యానికి పనికొస్తాయని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయి నాణ్యతతో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, నిరంతరం పర్యవేక్షణ సాగించేలా దృష్టి సారించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నత్తనడకన పురోగతి

11 లేబర్ ఏజెన్సీల ద్వారా ఈ లేఅవుట్లో 9,559 ఇళ్ళు మొదలుపెట్టారు. ఇప్పటివరకు కేవలం 94 మాత్రమే పూర్తయ్యాయి. రూఫ్ లెవెల్‌లో 747, ఇంకా పునాది దశలోనే 7,374 ఇళ్ళు ఉన్నాయి. ఇటీవల మరో 1,344 ఇళ్ల పనులను మొదలుపెట్టారు. 2025 మార్చి కల్లా మొత్తం నిర్మాణాలను పూర్తిచేసే విధంగా ఆయా సంస్థలతో ఒప్పందం జరిగింది. ఇందులో అత్యధికంగా నెల్లూరుకి చెందిన జెఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ 4633 ఇళ్ల నిర్మాణాలను జరుపుతోంది. ఇప్పటివరకు 372 నిర్మాణాలు రూఫ్ లెవెల్‌లో, 3,970 ఇళ్ళు పునాది దశలో ఉన్నాయి. ఐషన్ సంస్థ 659 నిర్మాణాలను ప్రారంభించగా 571 ఏళ్లకు పునాదులు వేశారు. 79 ఇళ్ళు ఇంకా ప్రారంభమే కాలేదు. రెండు ఇళ్ళు మాత్రమే స్లాబుల దశలోకి వచ్చాయి.



నాణ్యత లేకుండా దర్శనమిస్తున్న కాంట్రాక్టు సంస్థలు నిర్మిస్తున్న పునాది

నాణ్యంగానే నిర్మాణాలు

లేబర్ ఏజెన్సీల ద్వారా చేపట్టిన నిర్మాణాలన్నీ పూర్తి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగానే జరుగుతున్నాయి. పనుల్లో వినియోగిస్తున్న కాంక్రీటును ఎప్పటికప్పుడు ల్యాబ్ ద్వారా పరీక్షిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా పనులు ఎక్కడా జరగడం లేదు. తమ పూర్తి పర్యవేక్షణలోనే పనులు జరుగుతున్నాయి. లబ్ధిదారులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు.

–కెఎస్ఎన్ రెడ్డి, డిఇ, గృహ నిర్మాణ శాఖ, కాకినాడ

కూటమి ఎంపీ అభ్యర్థులు ఎవరు..?

- కాకినాడ బరిలో జనసేన అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్
- పొత్తులో రాజమహేంద్రవరం కోరుతున్న బిజెపి
- అమలాపురంపై కొనసాగుతున్న ఉత్కంఠ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అన్ని పార్టీలు పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై పూర్తిగా దృష్టి సారించాయి. ఇప్పటికే వైసిపి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. కాకినాడ నుంచి చలమలశెట్టి సునీల్, అమలాపురం నుంచి మాజీ ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్, రాజమహేంద్రవరం నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్లను ప్రకటించింది. అయితే కూటమి అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధిష్టానాలు ఇంకా కసరత్తులు చేస్తున్నాయి. కాకినాడ ఎంపీ స్థానానికి తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంగళవారం ప్రకటించారు. ఇక అమలాపురం, రాజమహేంద్రవరం అభ్యర్థులపై ఒక అవగాహనకు వచ్చినప్పటికీ అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. టిడిపి, జనసేన, బిజెపి ఆచి తూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

మెజార్టీ అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టిడిపి ప్రస్తుతం ఎంపీ అభ్యర్థులపై కసరత్తు చేస్తోంది. మంగళవారం టిడిపి ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తారని ప్రచారం జరిగినా మళ్లీ వాయిదా పడింది. రెండు మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. పొత్తులో భాగంగా రాజమహేంద్రవరం నుంచి బిజెపి అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేయనున్నట్లు కూటమి నేతలు చెబుతున్నారు. అయితే అధికారికంగా ప్రకటన మాత్రం విడుదల కాలేదు. వాస్తవానికి ఆమె విశాఖపట్నం నుంచి బరిలో ఉండాలని భావిస్తుండగా కేంద్ర నుంచి పిలుపు వచ్చింది. బుధవారం బిజెపి ముఖ్య నేతలు సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో పురందేశ్వరి కూడా ఢిల్లీలోనే ఉన్నారు. సమావేశం తర్వాత ఆమె రాజమహేంద్రవరం నుంచి బరిలో దిగుతారనే ప్రకటన వెలువడే అవకాశాలు కన్పిస్తున్నాయి.

అమలాపురం ఉమ్మడి అభ్యర్థిగా టిడిపి నేత, లోక్‌సభ ఇన్‌ఛార్జ్ గంటి హరీష్ పోటీ చేసే



కాకినాడ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్‌తో పవన్‌కళ్యాణ్

అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కీలక స్థానాలను టిడిపి ప్రకటించినప్పటికీ ఇక్కడ అభ్యర్థిని అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. అందుకు అనేక కారణాలున్నాయి. మాజీ ఎంపీ ఎజెవి. బుచ్చిమహేశ్వరావు కుమార్తె డాక్టర్ సత్యశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ యాతాటి రమేష్ బాబు కూడా ఈ స్థానానికి పోటీ పడుతున్న నేపథ్యమే ఈ సందిగ్ధతకు కారణంగా తెలుస్తోంది. వైసిపిపై పూర్తి వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో రాపాక వరప్రసాద్‌ను ఢీకొట్టే అభ్యర్థిని ఎంపిక చేయాలని టిడిపి భావిస్తుంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా ఆయా సామాజిక వర్గాల ఓట్లను రాబట్టుకునేందుకు కూటమి ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అమలాపురం పార్లమెంటు అభ్యర్థిని ఖరారు చేసిన తర్వాత అమలాపురం, పి.గన్నవరం అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. అభ్యర్థుల ఎంపికపై వైసిపి దూకుడుగా ఉన్నప్పటికీ కూటమి స్థానాల ఖరారుపై ఇంకా స్పష్టత రాకపోవడంతో టిడిపి, జనసేన శ్రేణుల్లో కొంత నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రత్యర్థి అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. దీంతో కూటమి అభ్యర్థులపై త్వరితగతిన స్పష్టత నివ్వాలని టిడిపి, జనసేన శ్రేణులు ఎదురుచూస్తున్నాయి.

ఒడిగోస్‌కు ఇండియా ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని విజెఎస్ఎంఆర్ ఒడిగోస్‌కు ఇండియా ఎక్సలెన్స్ అవార్డు లభించింది. విజెఎస్ఎంఆర్ ఒడిగోస్ టెక్నాలజీస్ మేనేజింగ్ పార్టనర్ వార వినోద్ ఇందుకు సంబంధించిన వివరాలను ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు తాజ్ హోటల్‌లో ఆదివారం జరిగిన ఇండియా ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రధానోత్సవంలో బాలీవుడ్ హీరోయిన్ అమ్రితా రావ్ చేతుల మీదుగా ఫాస్టెస్ట్ గ్రోయింగ్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ ఇన్స్టిట్యూట్ ఇన్ సౌత్ ఇండియా కేటగిరీలో ఇండియా ఎక్సలెన్స్ అవార్డు అందుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సివైఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు విజెఎస్ఎంఆర్ ఒడిగోస్‌కు అవార్డు రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం జేస్తూ విలువలతో కూడిన శిక్షణ ఇవ్వడం వల్లే ఈ అవార్డు లభించదని అన్నారు. పోస్టల్ యూనియన్ నాయకులు వార సత్య నారాయణ అభినందించి మరిన్ని అవార్డ్స్ రావాలని ఆకాంక్షించారు. అవార్డు గెలుచుకున్న విజెఎస్ఎంఆర్ ఒడిగోస్‌ను స్టేట్ ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ జూంగా గగరిన్, వాసిరెడ్డి ఏసుదాస్, డాక్టర్ పివివి.సత్యనారాయణ, ధర్మరావు, రేఖారెడ్డి, బాలాజీ, జాషువు గిరి, మచ్చ బుజ్జి, జిం విల్సన్, డాక్టర్ వంశీకృష్ణ రాజా, మోహన్ సర్, విద్యశ్రీ, విజయ్, చిన్న అభినందించారు.



ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న వారా వినోద్

టిడిపి శ్రేణుల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని కోరంగి పంచాయతీలోని పాతకోరంగి, బొడ్డువాని లంకలో టిడిపి శ్రేణులు ఇంటింటా ప్రచారాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో ముమ్మిడివరం నియోజకవర్గ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, ఎంపి అభ్యర్థి గంటి హరీష్ మాధూర్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు వెంటపల్లి చంద్రమౌళి, రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, అనంతలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, ధూళిపూడి బాబీ పాల్గొన్నారు.



కోరంగిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టిడిపి శ్రేణులు

మల్లు స్వరాజ్యంకి ఘన నివాళి

ప్రజాశక్తి - పిఠాపురం

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యంకు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం మండలంలోని గోకివాడ గ్రామంలో మల్లు స్వరాజ్యం 2వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్య నారాయణ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తున్న మహమ్మారి మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని ఎన్నో పోరాటాలు చేసిన వ్యక్తి మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. ఆమె ఇచ్చిన స్ఫూర్తితోనే నేడు ప్రభుత్వాలను, రాజకీయ నాయకులను ప్రశ్నించగల్గుతున్నామని అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మద్యపానానికి వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి కె. సింహాచలం, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా నాయకులు వేమగిరి తలుపులయ్య, సూరిబాబు, దానియేలు, లోవ, చిలకమ్మ, ప్రేమలత, మరియమ్మ, వెంకటలక్ష్మి, భవానీ, సూర్యకుమారి పాల్గొన్నారు



మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజలు

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లో వైసిపికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. **సామర్లకోట** మండలంలోని అచ్చంపేట క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సమక్షంలో వైసిపి నాయకుడు పప్పుల వీరబాబు తన అనుచరవర్గంతో కలిసి టిడిపిలో చేరారు. ఆయనకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్ర అభివృద్ధి విషయంలో చంద్రబాబుతో కలసి పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యా లయంలో వైఎస్ డిజిటల్స్ అధినేత తాతపూడి పవన్ కుమార్, యండమూరి వాసు ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **అన్నవరం** శంఖవరం మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన వైసిపికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. స్థానిక టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మెరపల నర్సయ్య ఆధ్వర్యంలో వైసిపికి చెందిన వార్డు సభ్యులు వేటూరి మాణిక్యం, రాయవరపు గంగబాబు, మొగులతుత్తి సత్తిబాబు, తదితర వైసిపి అభిమానులు టిడిపిలో చేరారు. వీరికి టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి వాత్సవాయి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని మల్లంపేటకు చెందిన వైసిపి నేత శ్రీరామ్‌రెడ్డి శ్రీనుతోపాటు వైసిపికి చెందిన పలువురు టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ సమక్షంలో మంగళవారం టిడిపిలో చేరారు.



పార్టీలో చేరిన వీరబాబుకు పార్టీ కండువా కప్పుతున్న చినరాజప్ప



అన్నవరం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

సంక్షేమ పథకాలు వివరించండి

ప్రజాశక్తి - అన్నవరం, ఏలేశ్వరం

ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైసిపికి పట్టం గట్టేలా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కోరారు. మంగళవారం ఎంఎల్ఎ అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఎంఎల్‌సి అనంతబాబుతో కలిసి అన్నవరంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా, పార్టీ కన్వీనర్లు కొండపల్లి అప్పారావు, దడాల సతీష్, కొల్లు బాబూరావు, సింగపల్లి రాము, ఎం.బాబూరావు, రాయుడు రాజు పాల్గొన్నారు. అలాగే ప్రత్తిపాడు మండలం పోతులూరులో జరిగిన సమావేశంలో ఆయన ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులు ప్రమేయం లేకుండా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఎంఎల్‌సి అనంత ఉదయభాస్కర్ మాట్లాడుతూ కులమత పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. అనంతరం సర్పంచ్ శెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ల సుధాకర్‌బాబు, వరుపుల సత్య సూరిబాబు, బెహరా దొరబాబు కార్యకర్తలు పాల్గొన్నారు

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని డిఎంహెచ్ఒ నరసింహ నాయక్ అన్నారు. మంగళవారం గొల్లపాలెం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌళిక ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిబిరంలో 109 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. పది మందిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. వైద్యాధికారులు సౌజన్య, శ్రేయ, సత్తిబాబు, మౌనిక వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రత్నరాజు, వైద్య సిబ్బంది రాజారావు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని సందర్శించిన డిఎంహెచ్ఒ

కార్టూ'నిజం'



దానికి ఆ గ్రూప్ వాళ్లు ఒప్పుకోవడం లేద్సార్..!!

నిర్లక్ష్యానికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట



ఇటీవల చిలకలూరి పేటలో జరిగిన ప్రజాగళం సభకు భద్రత కల్పించడంలో విఫలం అయిన పోలీసు అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళ వారం ఆయన ఓ ప్రకట నను విడుదల చేశారు. లక్షలాది మంది జనం ప్రజాగళం సభకు తరలి వచ్చిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో బందోబస్తు కల్పించాల్సిన పోలీసు అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా కొందరు పోలీసుల అధికారుల వైఖరిలో మార్పు రావడం లేదన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆధ్వర్యంలో జరిగిన సభకు లక్షలాదిగా ఆయా పార్టీల శ్రేణులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేశారని అన్నారు. కొందరు పోలీసు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోవడంతో వేలాది మంది సభ ప్రాంగణానికి చేరుకోలేక పోయారని అన్నారు. లక్షలాదిమంది ప్రజలు హాజరైన సభకు పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. ప్రధాన మంత్రి సభలో క్రౌడ్ మేనేజ్‌మెంట్ బాధ్యత ఎవరిది? అధికారులను ఏర్పాటుచేసి, జనాన్ని నియంత్రాం చాల్సిన బాధ్యత సీనియర్ పోలీసు అధికారులకు లేదా? అని ప్రశ్నిం చారు. జగన్ రెడ్డి ప్రభుత్వంతో పాటు అందులో పనిచేస్తున్న కొందరు అధికారులు ఉద్దేశ పూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్య కర్తలు సభను విజయవంతం చేశారని అన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన అవినీతి, దోపిడీని పిఎం నరేంద్ర మోడీ కళ్లకు కట్టినట్లు వివరించారని అన్నారు. ఇప్పటికైనా కొందరు పోలీసు అధికారులు తమ విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. సభకు అడ్డంకులు కలిగేలా వ్యవహరించిన పోలీసు అధికారులపై విచారించి చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను ఆయన డిమాండ్ చేశారు.

జనసేన కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పిల్లి అనంతలక్ష్మి దంపతులు, నానాజీ

ప్రజాశక్తి - కరప

స్థానిక మెయిన్ రోడ్డులో జనసేన ఎన్నికల కార్యాలయం ప్రారంభం అయ్యింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీతో కలిసి మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా కరప గ్రామం పల్లపు వీధికి చెందిన 30 మంది స్థానిక నాయకులు శ్రీపాదం గంగయ్య, చిన్నారి శ్రీనివాస్, గండి వీరబ్రహ్మం ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. వీరికి వారు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి మాచరావు, దేవు జమిందార్, యాసలాపు దుర్గాప్రసాద్, మద్దూరు స్వామి, మాజీ ఎంపిపి గుళ్ళపల్లి శ్రీనివాసరావు, జిల్లెల ప్రసాద్, బిజెపి నాయకులు వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆదిత్య విద్యా సంస్థల నిర్వాహకులు

విజ్ఞానదాయకంగా సాంకేతిక ఉత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 18, 19వ తేదీల్లో స్ట్రెంగ్త్ అఫ్ ఆన్ ఇంజినీర్ పేరిట సాంకేతిక ఉత్సవం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అల్ట్రాటెక్ లిమిటెడ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బి.లైట్ అండ్ స్ట్రాంగ్, సెప్మిక్ స్పెక్టకిల్ అండ్ ఎకో ఇన్నోవేషన్ అనే పోటీలను నిర్వహించారు. ఈవెంట్ కో-ఆర్డినేటర్ బి.రాంసాగర్ మాట్లాడుతూ మొత్తం ఈ కార్యక్రమానికి 15 కళాశాలలకు చెందిన 370కి పైగా విద్యార్థులు హాజరయ్యారన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతగా నిర్వహించిన సివిల్ విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బందిని ప్రిన్సిపల్ అభినందించారు.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో ఒక ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న 5 ఏళ్ల బాలికపై ఆటో డ్రైవర్ లైంగిక చర్యకు పాల్పడినట్టు వచ్చిన ఫిర్యాదుపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల..ప్రయివేటు పాఠశాలకు వెళ్లే బాలికను ఆటో డ్రైవర్ బాలికపై రోజూ తీసుకువెళ్తుంటాడు. ఆటో డ్రైవర్ బాలికపై లైంగిక చర్యకు పాల్పడుతున్నట్టు ఆ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. దీనిపై కాకినాడ దిశ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతిని మోసగించిన కేసులో ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి - అమలాపురం

యువతిని మోసగించిన కేసులో నిందితునికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానాను న్యాయమూర్తి విధించారని టౌన్ సిఐ కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పేరూరుకు చెందిన ఒక యువతిని ఐ.పోలవరంకు చెందిన పరమట వెంకటేశ్వరరావు(బాబు) ప్రేమపేరుతో నమ్మించాడు. సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావడంతో కట్నం ఆశించి, మరో యువతితో పెళ్లికి సిద్ధపడ్డాడు. దీనిపై బాధితురాలు 2019 జనవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు పరమట వెంకటేశ్వర రావుతోపాటు, అతని కుటుంబ సభ్యులపై అప్పటి సిఐ సి.హెచ్.శ్రీరామకోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వై.బెన్నయ్య నాయుడు నిందితునికి 7 ఏళ్లజైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు.

5 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలీ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తున్నారని సమాచారంతో ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ మంగళవారం సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఇందుకూరి కృష్ణంరాజును అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.765 విలువ చేసే 5 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం యర్రపోతవరంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ జాని బాషా తెలిపారు. యర్రపోతవరం శివారు ఖాళీస్థలం వద్ద అదే గ్రామానికి చెందిన దండుప్రోలు ఈశ్వరరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. అతన్ని అరెస్టు చేసి, 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండలంలోని చెయ్యేరు కొమ్మాయిచెరువు గ్రామంలో విద్యుదాఘాతానికి గురై పెద్దిశెట్టి ధనరాజు(30) మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..ధనరాజు వడ్రంగి పనిచేస్తూ జీవిస్తున్నాడు. తన పనిముట్టును విద్యుత్‌తో అనుసంధానం చేస్తుండగా విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ముమ్మిడివరం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - రాజోలు

ఆర్థిక ఇబ్బందులకు ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని నరేంద్రపురంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మద్దూరి శ్రీను(45) సైకిల్‌పై పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల అప్పు చేసి వరి కోత మిషన్ కొనుగోలు చేశాడు. అయితే ఆర్థిక ఇబ్బందులు కారణంగా వరి కోత మిషన్ వాయిదాలు చెల్లించలేకపోయాడు. దీంతో అప్పులు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై జీడి మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సిఐ కాశీ విశ్వనాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల 16వ నెంబరు జాతీయ రహదారిపై ముగ్గురు యువకులు రోడ్డుపై వెళ్తూ డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. బాధితులు కృష్ణ జిల్లా కంకిపాడుకు చెందిన వారిగా గుర్తించారు. మద్యం మత్తులో అధిక స్పీడులో వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

స్కూల్ బస్సు ఢీ కొని చిన్నారి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలో పాలచర్లలో ప్రయివేటు స్కూల్ బస్సు ఢీకొనడంతో నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. గ్రామంలో అంగన్ కేంద్రం నుంచి చేతులు శుభ్రం చేసుకోడానికి బయటకు వచ్చిన చిన్నారిని పాఠశాల బస్సు ఢీ కొంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందింది. కోరుకొండ మండలం బూరుగుపూడి చెందిన యంగ్ చాంప్ ప్రయివేటు పాఠశాల బస్సుగా రాజానగరం పోలీసులు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు


ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలో పదోతరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. మంగళవారం పెద్దాపురం డివిజన్ పరిధిలోని పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పట్టణ పరిధిలోని లూథరన్ హై స్కూల్, జవహర్ లాల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం పిలిప్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికల నియామవళి అమలు : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి మంగళవారం అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆమె పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో లోక్ సభ, శాసనసభ -2024 సాధారణ ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి,



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఐవిఎంలు ర్యాండమ్ మైజేషన్, సి-విజిల్ రిపోర్ట్స్, సీజర్ మ్యానేజ్‌మెంట్, చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ వంటి తదితర అంశాలపై ఈ సందర్భంగా సిఇఒ ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల ప్రవర్తన నియమావళికి తీసుకున్న చర్యలపై కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాటుచేసిన ప్రత్యేక బృందాలు పర్యవేక్షణ చేస్తున్నాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ ప్రతినిధుల చిత్రపటాలు తొలగించడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రధాన రహదారుల వెంబడి ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రచారం నిమిత్తం ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగించడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్, ఎన్నికల డిటి ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

సమాచారం లేకుండానే సర్వే

ప్రజాశక్తి - కాకినాడ

మత్స్యకారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సిస్మిక్ సర్వే కోసం ఒఎన్‌జిసి సంస్థ మోసం చేస్తుందని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు అన్నారు. ఏటిమొగ, దుమ్ములపేట, పర్లవపేట ప్రాంత బోటు ఓనర్స్‌కు సమాచారం అందించకుండా కేవలం అధికార పార్టీ నాయకులతో జిల్లా అధికారులు నిర్వ హించిన సమావేశంపై బోట్ ఒనర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మంగళవారం కొండబాబు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. డిఆర్ఒ డి.తిప్పేనాయక్ వచ్చి ఒఎన్‌జిసి, మత్స్యకారపెద్దలతో సమావేశం నిర్వ హిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కొండబాబు మాట్లాడుతూ చమురు నిక్షేపాల వెలికి తీత కారణంగా మత్స్యకారులు ఉపాధిని కోల్పోతున్నారన్నారు. ఈ నెల 11న కలెక్టర్ నిర్వహిం చిన సమావేశంలో మత్స్యకారులకు జరుగు తున్న నష్టంపై ఒఎన్‌జిసి సంస్థ అందించే నష్ట పరిహారంపై త్వరలో సమావేశాలు నిర్వహించి న్యాయం చేస్తామని కలెక్టర్ తెలిపారన్నారు. కాని వైసిపి నాయకులతో మాత్రమే సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. చమురు నిక్షేపాల వెలికితీత కారణంగా జీవనోపాధిని కోల్పోయిన మత్స్యకార ప్రాంత కుటుంబాలకు అందించే నష్ట పరిహారాన్ని దోచుకున్నారన్నారు. నష్టపరిహార సొమ్మును కూడా దోచేయడానికి కుట్రలు చేస్తున్న వారికే అధికారులు వంత పాడటం విడ్డూ రంగా ఉందన్నారు. వెంటనే నష్ట పరిహారం అందిం చేలా అధికారులు చర్యలు చేపట్టాలని వనమాడి కోరారు. ఈ కార్యక్రమంలో బోటు ఓనర్స్ ప్రతినిధులు సంగాని నాగేశ్వరరావు, మల్లాడి రాజు, వనమాడి కోయరాజు, రేకాడి లోవరాజు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న వనమాడి

టిడిపి ఎస్‌సి సెల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నేత వర్మ

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్.వర్మ అధ్యక్షతన నియోజకవర్గ ఎస్‌సి సెల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పొత్తులో భాగంగా పిఠాపురం నుంచి పోటీలో ఉంటానని తెలిపారని, చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు కార్యకర్తలతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వర్మాస్ కావ్య ఫౌండేషన్ ద్వారా ప్రతీ ఏడాది నిర్వహిస్తున్న ఎంసెట్ (ఇంజనీరింగ్, మెడిసిన్) కోచింగ్‌కు విద్యార్థుల నుంచి దరఖాస్తులను బుధవారం నుంచి స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు స్థానిక రాజావారి కోటలో అంజనా కాలేజీ పక్కన గల టిడిపి కార్యాలయన్నీ సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇతర వివరాలకు మొబైల్ నంబర్స్ 8978869999, 08869255555 సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్‌పిటిసి సభ్యులు మడికి ప్రసాద్, బత్తుల చైతన్య రాజేష్, మండల, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షులు నుతాటి ప్రకాష్, బత్తిన మురళీ, దొమ్మేటి మనోహర్, బత్తిన శ్రీనువాస్, మాధవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి ఓటర్ జాబితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో బూత్ కమిటీ అధ్యక్షులు, మునిసిపల్ కౌన్సిలర్‌లతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఓటర్ జాబితాల్లో మృతులు, స్థానికంగా నివాసం లేనివారిని చేర్పించి ఆ ఓట్లను దొంగ ఓట్లుగా వేసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాంటి లోపాలకు తావు లేకుండా బూత్ కమిటీలు, కౌన్సిలర్‌లు ముందుగానే ఓటర్ జాబితా కాపీలను తీసుకుని నిశితంగా రిశీలించాలన్నారు. అలాగే వైసిపికి ఉన్న ఓటుబ్యాంక్‌ను గుర్తించి వారి ఓట్లు పోకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకుడు గంగిరెడ్డి కష్ణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోసెస్, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర నాయకురాలు మడికి సోనియా పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న దొరబాబు

కేంద్ర బలాగాలతో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - రౌతులపూడి

రాబోయే సార్వత్రిక ఎన్నికలకు దృష్టిలో పెట్టుకుని ప్రజలను చైతన్యం చేసేందుకు కేంద్ర బలాగాలతో కవాతును నిర్వహించారు. మంగళవారం మండలంలోని పారుపాక, రౌతులపూడి ప్రాంతాల్లో ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కవాతు సాగింది. తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్ఐ కోరారు. గతంలో జరిగిన ఎన్నికల్లో పలు సంఘటనలకు కారణమైన వారిపై ప్రత్యేక నిఘాను ఉంచామని ఆయన తెలిపారు.

23న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 23న స్థానిక భగతసింగ్ విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు బాలం హరి, చల్లా మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి సందర్భంగా రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి జరిగే ఈ శిబిరంలో ఆసక్తి గల్గిన యువత పాల్గొని రక్తాన్ని దానం చేయాలని కోరారు.

జెఎన్‌టియుకెలో వర్క్‌షాపు

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె ప్రాంగణం లోని అలూమినీ ఆడిటోరియంలో ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో యుసిఇకె పిఇ, సిఇ విభాగం, జెఎన్‌టి యుకె సొసైటీ ఆఫ్ పెట్రోలియం ఇంజినీర్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పెట్రోలియం ఇండస్ట్రీ సహకారంతో ప్రాసెస్ సేఫ్టీ ఎలిమెంట్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ ఇన్ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీస్ వర్క్ షాప్ నిర్వహించారు. వర్క్ షాప్ నకు ముఖ్యఅతిథిగా ఖతార్ లోని ఆరిక్స్ జిటిఎల్ సంస్థ నుండి డా.రేఖపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. గౌరవ అతిథులుగా యుసిఇకె ప్రిన్సిపల్ ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్, పెట్రోలియం కోర్సుల అడ్వయిజర్ ప్రొఫెసర్ కెవి.రావు, పిఇ అండ్ సిఇ విభాగాధిపతి డాక్టర కె.కృష్ణభాస్కర్ హాజరయ్యారు. ఒడిఎల్ డైరెక్టర్ ప్రొ.కెవిఎసి.మురళీకష్ణ కార్యక్రమానికి అధ్యక్షత వహించి స్వాగతం పలికారు. పరిశ్రమలకు అవసరమైన భద్రత, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కోసం వర్కుషాపు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, అనుబంధ కళాశాలలకు చెందిన 400మంది ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆరిక్స్ జిటిల్ సంస్థ ప్రతినిధి డా.రేఖపల్లి

చెక్ పోస్టుల వద్ద అప్రమత్త అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది చెక్‌పోస్టుల వద్ద మరింత అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి కోడ్ ఆఫ్ కాండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో గ్రాఫర్స్‌తో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన టీం అధికారులు, సిబ్బంది తమకు నిర్దేశించిన సమయా నికి అందుబాటులో ఉండాలన్నారు. సమయపాలన పాటించని వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి టీము తన రోజువారి కార్యక్రమాల రిపోర్టును, వీడియోలను రిజిస్టర్‌లో పొందుపరిచి టీమ్ లీడర్‌కు అందించాలన్నారు. ప్రచార వాహనాలకు ఇచ్చిన అనుమతి పత్రాలు ఉండాలని, లేనిపక్షంలో ప్రచార వాహనాలను వెంటనే సీజ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు శ్రీనివాసరెడ్డి, కెవి.పద్మావతి, జి.ఉషారాణి పాల్గొన్నారు.

పెద్దనాపల్లిలో సత్యప్రభ పర్యటన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో పెద్దనాపల్లి టిడిపి శ్రేణులు సత్య ప్రభకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. టిడిపి ఎన్నికల మినీ మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను అందించారు. రాబోయే టిడిపి, జనసేన, బిజెపి పాలనలో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగౌతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు పాల్గొన్నాయి.

.నింబంధనలు విస్మరిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఎన్నికల నిబంధనలను విస్మరిస్తే చర్యలు తప్పవని ప్రత్తిపాడు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.శ్రీనివాసరావు హెచ్చరించారు. ̃ మంగళవారం ప్రతిపాడులో జరిగిన ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల ప్రతినిధులు, పెద్దాపురం డిఎస్‌పి లలిత కుమారి, ప్రత్తిపాడు సిఐ శేఖర్ బాబు, అధికారులు ఉన్నారు.

పరీక్షకు 17 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - కిర్లంపూడి

కిర్లంపూడి మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన పరీక్షకు 17 మంది విగైర్హాజరయ్యారని ఎంఇఒ జోసఫ్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 986 మందికి 980 మంది ప్రైవేట్ విద్యార్థులు 14 మందికి ముగ్గురు విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.



ఓటర్లతో మాట్లాడుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ఇంటింటికీ నల్లమిల్లి ప్రచారం

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలోని గొల్లలమామిడాడ గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని ప్రజలను కోరారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా కలిగే లబ్ధిని ప్రజలకు వివరించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైసిపి పాలనకు సమాధి కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జుత్తుక కృష్ణ, తమలంపూడి శివరామరెడ్డి, జనసేన నాయకులు ఆర్.నాగు, సూరిబాబు, వాసంశెట్టి శ్రీను, పలివేల బుజ్జి పాల్గొన్నారు.

తోటను కలిసిన సర్పంచ్ దేవి



వైసిపి శ్రేణులతో తోట నరసింహం

ప్రజాశక్తి - కిర్లంపూడి

జగ్గంపేట మండలం ఇర్రిపాక సర్పంచ్ త్రిరి దేవి, వైస్ ఎంపిపి కె.నాగలక్ష్మి, ఇతర కార్యకర్తలు తోట నరసింహంను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని వీరవరం గ్రామంలో తోట స్వగృహంలో వారు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లా డుతూ గతంలో ఇర్రిపాక, మామిడాడ తదితర గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

యానాం వార్తలు

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా రాధాకృష్ణన్

ప్రజాశక్తి - యానాం

ఝార్ఖండ్ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకష్ణన్‌కు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకూ పుదుచ్చేరి ఎల్‌జిగా, అలాగే తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించిన తమిళ సై రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించింది. దీంతో కేంద్రం ఝార్ఖండ్ గవర్నర్ రాధాకష్ణన్‌కు తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి ఎల్‌జిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

రీజన్సీలో ఎన్ఎస్ఎస్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

రీజన్సీ జూనియర్ కళాశాలలో వారం రోజులపాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మంగళవారం ప్రారంభమైంది. ఎన్ఎస్ఎస్ యానాం రీజియన్ కో-ఆర్డి నేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, కళాశాల ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్ ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ క్యాంపు ఆవశ్యకతను వివరించారు. ఈ శిబిరంలో 50 మంది వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతపల్లి కష్ణ సుధాకర్



వైసిపిలోచేరిన వారికి కండువా కప్పుతున్న ముద్రగడ

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కోలిశెట్టి పరమేశ్వరరావు వైసిపిలో చేరారు. మంగళవారం వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం స్వగృహంలో వైసిపి నాయకుడు తోట రామకృష్ణ అధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు ముద్రగడ పద్మనాభం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద దేవం గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, తాళ్లపూడి మండలం కాపు సం ఘం అధ్యక్షుడు నామ ప్రకాశం, కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వనిమిరెడ్డి శీను, ప్రక్కిలంక గ్రామ వైస్ ప్రెసిడెంట్ విత్తం నాని, వైసిపి నాయకులు చాముకూరి సత్యనారాయణ, చాగల్లు ఎంపిటిసి ఇంటి వీర్రాజు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్రోచర్ల ధరల్లో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్లెక్సీలు, బ్రోచర్ల విషయంలో పబ్లిసిటీ ప్రింటర్స్ ఎన్నికల నిబంధనల ప్రకారం జాగ్రత్తలు పాటించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు సూచించారు. మంగళవారం పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో ఉన్న పబ్లిసిటీ ప్రింటర్స్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డర్ తీసుకునే ముందు అభ్యర్థి ఆధార్ కార్డు, కాపీలు, వాటి ధర వివరాలన్నీ రికార్డు చేయాలన్నారు. ఈ సమావేశంలో పెద్దాపురం తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి, సామర్లకోట తహశీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యజమానులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ